
తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
09-08-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 182
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు
స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575




## ఒకే వ్యక్తికి
# రెండు జీతాలు..!

- తప్పుడు పట్టాలతో జేఎల్ ఉద్యోగాలు!

ఆర్థిక శాఖ విడుదల చేసిన నలభై మంది జాబితాతో విచారణ తీవ్రతరం

ఉద్యోగులకు సహకరించిన అధికారులపైనా క్రిమినల్ చర్యలకు ఆదేశాలు

ఆర్ఆర్ యాక్ట్ ద్వారా నిధుల రికవరీకి ప్రభుత్వం పక్కా ప్రణాళిక

యాభై ఏడు మంది జూనియర్ లెక్చరర్లకు నోటీసులు జారీ చేసిన అధికారులు

2013 తర్వాత వేరే రాష్ట్రాల దూరవిద్య పట్టాలు చెల్లవు

టీపీపీఎస్సీ నియామకాల్లోనూ వందకు పైగా ఫేక్ పట్టాల వినియోగం

సంగారెడ్డి విద్యుత్ శాఖలో నాలుగేళ్లుగా ఫేక్ సర్టిఫికెట్ల దందా

అన్ని శాఖల్లోనూ సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌కు సర్కార్ రంగం సిద్ధం

తెలంగాణలో ఒకే వ్యక్తి రెండు వేర్వేరు చోట్ల జీతాలు తీసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు ఏళ్ల తరబడి గండి కొట్టిన ఘోర ఉదంతంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఒకే వ్యక్తి రెండు జీతాలు పొందిన అధికారుల, ఉద్యోగుల వివరాలను ఆర్థిక శాఖ ఇప్పటికే అధికారికంగా సేకరించింది. ఈ మేరకు 40 మందితో కూడిన ప్రాథమిక జాబితాను విడుదల చేసిన ఆర్థిక శాఖ, సదరు ఉద్యోగులతో పాటు వారికి వెనకుండి సహకరించిన అధికారులపైనా క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతోంది. కీలక శాఖలలో సైతం ఇలా రెండు వేర్వేరు జీతాలు పొందడంపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలన్నింటిలోని ఉద్యోగుల వివరాలను ఒకే మొబైల్ పోర్టల్‌లోకి తీసుకురావడం వల్ల కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ దందా బయటపడింది.

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:

**అంతర్రాష్ట్ర ఫేక్ పట్టాలతో జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు**

మరోవైపు, ఉనికిలోనే లేని విశ్వవిద్యాలయాల నుంచి నకిలీ పట్టాలు తెచ్చి జూనియర్ లెక్చరర్లుగా ఉద్యోగాలు పొందిన వ్యవహారంపై ప్రభుత్వం జరిపిన విచారణలో ఏకంగా 37 మందిని దోషులుగా తేల్చారు. వీరి వివరాలను శాఖపరంగా విడుదల చేస్తూ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసిన సమయంలోనే జరగాల్సిన ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన (జెన్యునిటీ) ఇంత ఆలస్యంగా జరగడానికి గల కారణాలపై

మిగతా 2వ పేజీలో..




## పారదర్శకంగా సేవలందించడం
# ప్రతి అధికారి బాధ్యత

- కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరు మరింత సరళతరం
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్
- సర్వీస్ లైన్ చార్జెస్ అమలుపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహణ

తెలంగాణ, సిరి న్యూస్:

వినియోగదారులకు విద్యుత్ సేవలను ఎలాంటి జాప్యం, అసౌకర్యం లేకుండా పారదర్శకంగా, వేగవంతంగా అందించడం ప్రతి అధికారికి ప్రధాన బాధ్యత అని టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ పేర్కొన్నారు. శనివారం టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలోని

మిగతా 2వ పేజీలో..

## క్షుద్ర రాజకీయాలు
# కాంగ్రెస్‌కే చెల్లు

- తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు
- నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది
- నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సీఎం రేవంత్ రెడ్డి
- మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2





## పెద్ది కుటుంబానికి
# బీఆర్ఎస్ అండ

- రూ.2.25 కోట్లు అందించాలని కేసీఆర్ నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 8, సిరి న్యూస్ :

అనారోగ్యంతో ఇటీవల మరణించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలనుంది. ఆయన కుటుంబానికి పార్టీ తరఫున రూ.2.25 కోట్ల సాయం అందజేయాలని పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య

మిగతా 2వ పేజీలో..

# శ్రీశైలానికి కొనసాగుతున్న వరద



- 2.32 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం
- 876.20 అడుగులకు చేరిన నీటిమట్టం
- పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో జలాశయం
- విద్యుదుత్పత్తితో సాగర్కు 66,460 క్యూసెక్కుల నీరు విడుదల
- తుంగభద్రకు తగ్గిన వరద.. 72.26 టీఎంసీల నిల్వ

3



## మహిళా బిల్లుపై మాటల యుద్ధం

- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ కౌంటర్

4




## డిగ్రీతో కాదు.. దేశసేవ కలలతో బయటకు వెళ్లండి

4

# సల్కం చెరువు కేసులో హైడ్రాకు కోర్టు సెగ

- కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఉన్నతాధికారులకు హైకోర్టు నోటీసులు
- ఆక్రమణలపై చర్యలు తీసుకోవడంలో జాప్యంపై ఆగ్రహం
- 11న తదుపరి విచారణ.. అధికారుల వివరణపై ఉత్కంఠ

3




## హైడ్రా ఉద్యోగాలకు పోటెత్తిన యువత

- 150 డ్రైవర్ పోస్టులకు వేలాదిమంది పోటీ

3



## మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

- మహిళా సాధికారతకు అండగా కాంగ్రెస్
- యూత్ కాంగ్రెస్ నారీ శక్తి అభియాన్ శిక్షణలో మంత్రి సీతక్క

2

# భూసేకరణ, పునరావాసానికి నిధుల కొరత లేదు



సాగు నీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల విడుదలకు లైన్ క్లియర్

మిడ్‌మానేరు ఎడమ కాల్వ పనులు వెంటనే పునఃప్రారంభించాలి

అనుమతుల పేరుతో పనులు ఆగొద్దు.. కలెక్టర్లకు ఆదేశాలు

పత్తిపాక డీపీఆర్ నెలాఖరులోగా సిద్ధం

రోళ్లవాగుకు అటవీ అనుమతులు వేగవంతం చేయాలి

మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

3

## రాష్ట్రంలో పెట్టుబడులకు
# అపార అవకాశాలు

- రూ.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- వేమో డ్రైవర్లెస్ కారులో ప్రయాణం
- ప్రవాసులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

# రాష్ట్రంలో పెట్టుబడులకు అపార అవకాశాలు



**శాన్ ఫ్రాన్సిస్కో, సిరి న్యూస్:**

తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నిరంతర విద్యుత్ సరఫరా, మెరుగైన మౌలిక సదుపాయాలు రాష్ట్ర బలాలని పేర్కొన్నారు. అమెరికాలోని శాన్ఫ్రాన్సిస్కోలో భారత కాన్సులేట్ జనరల్ (సీజీఐ ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బే ఏరియాకు చెందిన తెలుగు ప్రవాసులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు, వృత్తి నిపుణులతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. పారిశ్రామిక కారిడార్లు, పార్కుల్లో తయారీ, ఐటీ, జీవశాస్త్రం, స్వచ్ఛ ఇంధనం తదితర రంగాల్లో పెట్టుబడులకు అనువైన భూమి అందుబాటులో ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర విద్యా. సాంకేతిక సంస్థలను బలోపేతం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో పరిశ్రమలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ అందించే సామర్థ్యం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సంప్రదాయ విద్యుత్ పాటు పునరుత్పాదక ఇంధన వనరు రంగంలోనూ రాష్ట్రం గరిష్ట ప్రగతిని సాధిస్తోందని చెప్పారు. పెట్టుబడిదారులకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. అనుమతులకు ఎక్కడా అలస్యం జరక్కుండా పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికత, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, సుస్థిర పట్టణ ప్రణాళికను సమన్వయం చేస్తూ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని చెప్పారు. ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, అధునాతన తయారీ, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలపై దృష్టి సారించి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో తెలంగాణ ప్రవాసులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమల విస్తరణలో భాగస్వాములు కావాలని కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాన్ఫ్రాన్సిస్కోలో వేమో స్వయంచాలక (డ్రైవర్స్) వాహనంలో ప్రయాణించారు. అనంతరం వేమో ప్రతినిధులతో సమావేశమై స్వయంచాలక వాహన సాంకేతికత, దాని నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నియంత్రణ విధా నాలపై వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్ తో పాటు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలో స్వయంచాలక మొబిలిటీ పరిష్కారాలను ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలపై ఆయన ఆరా తీశారు. ఇందుకు అవసరమైన అధిక రిజల్యూషన్ మ్యాపింగ్, సెన్సార్ అనుకూల రోడ్డు డిజైన్, ప్రత్యేక టెస్టింగ్ కారిడార్లు, డేటా కనెక్టివిటీ, ఏఐ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల గురించి వేమో ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్వయంచాలక వాహనాల ట్రయల్స్, భవిష్యత్ విస్తరణకు అవసరమైన నియంత్రణ, విధానపరమైన చట్రాలపైనా చర్చించారు. నూతన తరం మొబిలిటీ సాంకేతికతను హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ పట్టణాభివృద్ధి ప్రణాళికల్లో అనుసంధానం చేసే అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆసక్తి వ్యక్తం చేశారు.




# పారదర్శకంగా సేవలందించడం ప్రతి అధికారి బాధ్యత

**మొదటిపేజీ తరువాయి**

సీపీటీఐలో యూనిఫాం సర్వీస్ లైన్ చార్జెస్ అమలుపై నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల అసలు లక్ష్యం వినియోగదారులకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించడమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పరిష్కరించి, వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. యూనిఫాం సర్వీస్ లైన్ చార్జెస్ అమలుతో కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియ మరింత సరళతరం, పారదర్శకంగా మారుతుందని ఆయన తెలిపారు. ఈ విధానాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి వినియోగదారునికి ఒకే విధమైన, నాణ్యమైన సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారుల సమస్యలను సకాలంలో పరిష్కరించడం, ఫిర్యాదులపై వెంటనే స్పందించడం, ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలందించడం ప్రతి అధికారి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తూ టీజీఎస్పీడీసీఎల్ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ (కమర్షియల్) ప్రతిమ సౌమి ఆధ్వర్యంలో యూనిఫాం సర్వీస్ లైన్ చార్జెస్ అమలు విధానం, తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి నిబంధనలు, వినియోగదారుల సేవల్లో పారదర్శకత, దరఖాస్తుల సకాల పరిష్కారం, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన విధివిధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని 21 ఆపరేషన్ సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



# ఒకే వ్యక్తికి రెండు జీతాలు..!

**మొదటిపేజీ తరువాయి**

ఉన్నతాధికారులు లోతైన విచారణకు ఆదేశించారు. తప్పుడు ధ్రువపత్రాలతో ఏళ్ల తరబడి పొందిన జీతాలను ఆర్ఆర్ యాక్ట్ ద్వారా రికవరీ చేయాలని నిర్ణయించారు.

**క్రమబద్ధీకరణ, టీపీపీఎస్సీ నియామకాల్లోనూ అక్రమాలు**

తెలంగాణలో 3,100 మంది లెక్చరర్లను క్రమబద్ధీకరించగా, వారిలో 37 మంది తప్పుడు ధ్రువపత్రాలతో ఉద్యోగాలు సాధించినట్లు నిర్ధారించారు. 2013 తర్వాత వేరే రాష్ట్రాల్లో దూరవిద్య ద్వారా పొందిన పట్టాలు చెల్లవని అధికారులు తెగేసి చెప్పారు. 2013 తర్వాత వేరే రాష్ట్రాల నుంచి నకిలీ పట్టాలు పొంది జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి పొందిన వారి సర్టిఫికెట్లను తనిఖీ చేస్తే ఈ సంఖ్య వందల్లోకి చేరుతుందని తెలుస్తోంది. అంతేకాకుండా, 2025 టిపిపిఎస్సి ద్వారా జరిగిన నియామకాల్లో 2013 తర్వాత వేరే రాష్ట్రాల్లో దూరవిద్య కోర్సు ద్వారా పట్టాలు పొందిన వారి సంఖ్య 100కి పైగా ఉందనే ప్రచారం జరుగుతోంది. మినిమం టైమ్ స్కేల్ నుండి రెగ్యులర్ అయిన వారిలోనూ 100 మందికి పైగా ఫేక్ పట్టాలతో ఉద్యోగాలు పొందినట్లు ప్రాథమిక సమాచారం.

**పోలీస్, విద్యుత్ శాఖల్లో నకిలీ సర్టిఫికెట్ల రగడ**

ఆర్థిక శాఖ సేకరించిన రికార్డుల ప్రకారం.. ఒకే శాఖలో రెండు చోట్ల పని చేస్తున్నట్లు జీతాలు తీసుకుంటున్న వారిలో పోలీస్ శాఖలో అత్యధిక సంఖ్యలో ఉన్నట్లు తేలడం విస్తుగొలుపుతోంది. ఈ వ్యవహారం ఎన్నేళ్లుగా సాగుతోంది? సదరు 40 మంది పొందిన ఆర్థిక లబ్ధి ఎంత? అనే కోణంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. మరోవైపు, సంగారెడ్డి జిల్లా విద్యుత్ శాఖలో నలుగురు ఉద్యోగులు నాలుగేళ్లపాటు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేసి, ఒక్కొక్కరు కోటికి పైగా ఆర్థిక లబ్ధి పొందిన ఉదంతం వెలుగుచూసింది. దీంతో ఐదేళ్ల క్రితం జరిగిన జేఎల్ఎమ్ నియామకాల విద్యార్థార్హతలపై డిస్కం అధికారులు రీవెరిఫికేషన్ మొదలుపెట్టారు.

**రిటైర్డ్ ఉద్యోగులపై సైతం విచారణకు వెసులుబాటు**




విద్యుత్ శాఖలోని డిస్కంలలో కొందరు పదోన్నతుల కోసం, మరికొందరు కన్వర్షన్ల కోసం లేని కళాశాలల నుంచి నకిలీ పట్టాలు తెచ్చినట్లు ఆధారాలు లభించాయి. దీంతో 2010 నుండి 2014 వరకు జేఎల్ఎమ్ నుండి జూనియర్ అసిస్టెంట్ మరియు సబ్ ఇంజనీర్లుగా కన్వర్షన్, ప్రమోషన్ పొందిన ఉద్యోగుల జాబితాను అధికారులు బయటకు తీస్తున్నారు. ఇందులో కొందరు ఇప్పటికే ఉద్యోగ విరమణ చేసినట్లు సమాచారం. ప్రభుత్వం నేరుగా కార్పొరేషన్ ఆర్థిక వ్యవహారాలు చూడకపోయినప్పటికీ, విద్యాశాఖలో బయటపడ్డ ఫేక్ లెక్చరర్ల వ్యవహారంతో విద్యుత్ శాఖలోనూ నకిలీ పట్టాల ప్రక్షాళన దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి.

# మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

**ఢిల్లీ, ఆగస్టు 8, సిరి న్యూస్ :**

మహిళల రాజకీయ భాగస్వామ్యమే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మహిళలు కేవలం ఓటర్లుగా కాక దేశ భవిష్యత్తుకు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా నిలిచిందన్నారు. ఢిల్లీలోని యూత్ కాంగ్రెస్ నారీ శక్తి అభియాన్ శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాజకీయాల్లో మహిళల పాత్ర, మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి, నిర్ణయాత్మక శక్తిగా మహిళలు ఎదగడంలో కాంగ్రెస్ పాత్ర, ఆన్‌లైన్ యుగంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు వంటి అంశాలపై కీలక ఉపన్యాసం చేశారు. మహిళల అభివృద్ధి లేకుండా దేశ అభివృద్ధి సాధ్యం కాదని సీతక్క అన్నారు. మహిళల హక్కులు, సమాన అవకాశాలు, రాజకీయ భాగస్వామ్యం కోసం కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా పోరాడిందని తెలిపారు. మహిళలకు సమానావకాశాలు కల్పించడం కేవలం సంక్షేమ కార్యక్రమం కాదని, అది సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. దేశంలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు ఓటు హక్కు రావడంతోనే సమానత్వం పూర్తికాదని, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం, ప్రభుత్వాలను నడిపించే అవకాశం కూడా సమానంగా ఉండాలని అన్నారు. మహిళలు రాజకీయాల్లోకి వస్తే వారి దృష్టి రోడ్లు, భవనాలపై ఉండదని, పిల్లల విద్య, తల్లుల ఆరోగ్యం, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రాలు, పోషకాహారం, గ్రామీణ జీవనోపాధులు, మహిళల ఆర్థిక స్వావలంబన వంటి అంశాలకు మహిళా నాయకత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ మారుమూల అడవుల్లో, గిరిజన ప్రాంతాల్లో ప్రజలతో కలిసి పని చేసిన అనుభవం మహిళల రాజకీయ భాగస్వామ్యం ఎంత అవసరమో తనకు నేర్పిందన్నారు. అవకాశాలు కల్పిస్తే మహిళలు నాయకత్వంలో అద్భుతంగా రాణించగలరని చెప్పారు. ఆన్‌లైన్ యుగంలో మహిళలు ఎదుర్కొం టున్న సవాళ్లపై మంత్రి సీతక్క తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు ప్రజా సమస్యలను లేవనెత్తినప్పుడు వారి వాదనలకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, తప్పుడు ప్రచారం, మార్ఫింగ్, బెదిరింపులకు పాల్పడటం ఆందోళనకరమని అన్నారు. మహిళల గొంతును అణచివేసే డిజిటల్ వేధింపులు కేవలం ఒక మహిళకు ఎదురవుతున్న సమస్య కాదని, అది ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాలని సీతక్క అన్నారు. ఇలాంటి దాడులు రాజకీయాల్లోకి రావాలనుకునే యువతులను కూడా వెనక్కి లాగే ప్రమాదం ఉందని తెలిపారు. రాజకీయ విభేదాలు విధానాలపై ఉండాలి కానీ వ్యక్తులపై కాదని స్పష్టం చేశారు. మహిళలపై ఆన్‌లైన్ వేధింపులకు పాల్పడే సంస్కృతిని అడ్డుకోవాల్సిన బాధ్యత పార్టీలు, మీడియా, డిజిటల్ వేదికలు, పౌర సమాజంపై ఉందన్నారు. తెలంగాణలో మహిళా స్వయం సహాయక సంఘాల విజయాలను ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రస్తావించారు. చిన్న పొదుపులతో ప్రారంభించిన మహిళలు నేడు వ్యాపారవేత్తలుగా ఎదిగి ప్రభుత్వ కార్యక్రమాల అమలులో భాగస్వాములుగా మారారని చెప్పారు. పాఠశాల యూనిఫామ్‌ల తయారీ నుంచి గ్రామీణ జీవనోపాధుల బలోపేతం వరకు మహిళలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని తెలిపారు.

# పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ

**మొదటిపేజీ తరువాయి**

నేతలతో కేసీఆర్ చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం రూ.25 లక్షలను ఆమె పేర బ్యాంకులో జమ చేయాలని కూడా కేసీఆర్ నిర్ణయించారు. అంతేగాక పిల్లల భవిష్యత్తు, వారి చదువు, కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని అధినేత తెలిపారు. కాగా, సుదర్శన్ రెడ్డి దశదిన కర్మల కార్యక్రమాలు ముగిసిన తర్వాత పార్టీ జిల్లా ముఖ్యులు సమావేశమై వారి కుటుంబ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారనీ, ఎల్లకాలం వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

**రేపు పెద్ది కుటుంబ సభ్యులకు కేసీఆర్ పరామర్శ**

నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని నల్లబెల్లికి కేసీఆర్ ఆదివారం వెళ్లి పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో విషాదంలో ఉన్న అధినేత కేసీఆర్ తన ఆప్తుని కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. ఈ సందర్భంగా ఇంటి పెద్దను కోల్పోయి శోక తప్త హృదయులైవున్న పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్టకాలంలో ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. ఇదే సందర్భంలో పార్టీ నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు అధినేత కేసీఆర్ గుండె ధైర్యం నింపనున్నారు.

# యూఏఈ బతుకమ్మ సంబరాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

- **అక్టోబర్ 11న దుబాయ్ అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్‌లో వేడుకలు**
- **కార్మికుల సమస్యలపై ఈటీసీఏ ప్రతినిధులతో కేటీఆర్ చర్చ**

**హైదరాబాద్, ఆగస్టు 8, సిరి న్యూస్ :**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏయూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు. ఈమేరకు కేటీఆర్ నివాసంలో శుక్రవారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన చేతుల మీదుగా విడుదల చేశారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో పదహారేళ్లుగా యూఏఈలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, తెలంగాణ సంస్కృతీసాంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏటా బతుకమ్మతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈసారి అక్టోబర్ 11న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

**గల్ఫ్ కార్మికుల పరిస్థితులపై ఆరా**

ఈ సందర్భంగా గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికుల పరిస్థితులు, ఉపాధి అవకాశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై కేటీఆర్ ఆరా తీశారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్నప్పటికీ తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈటీసీఏ ప్రతినిధులను కేటీఆర్ అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంలో ప్రవాస తెలంగాణ సంఘాల కృషి అభినందనీయమన్నారు. ఈటీసీఏ కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా గల్ఫ్ కార్మికుల కష్టనష్టాల్లోనూ అండగా నిలుస్తూ ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ బిడ్డలకు సహాయసహకారాలు అందిస్తున్న తీరు గొప్పదని కేటీఆర్ అన్నారు. గల్ఫ్‌లో తెలంగాణ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లో వివిధ కారణాలతో చిక్కుకుపోయిన పలువురు తెలంగాణవాసుల సమస్యల పరిష్కారానికి కేటీఆర్ వ్యక్తిగతంగా ప్రత్యేక చొరవ చూపి వారిని స్వస్థలాలకు చేరుకునేలా చేసిన విషయాన్ని ఈటీసీఏ ప్రతినిధులు ఈ సందర్భంగా గుర్తు చేస్తూ కేటీఆర్ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

**హైదరాబాద్, ఆగస్టు 8, సిరి న్యూస్ :**

క్షుద్ర పూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం.. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం.. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదని అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటామన్నారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లనూ ధ్వంసం చేసి వోట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదన్నారు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు. కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన వస్తుందని స్పష్టం చేశారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం ఎజెండా పూర్తిగా రాష్ట్ర హక్కులను కాలరాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్‌ని సలహాదారుగా పెట్టుకోవడమే ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్‌ని తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామన్నబీఆర్ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముల్లు తో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.

# భూసేకరణ, పునరావాసానికి నిధుల కొరత లేదు

హైదరాబాద్, ఆగస్టు 8, సిరి న్యూస్:

రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసంపునర్నిర్మాణం కోసం ప్రాధాన్యత ప్రాతిపదికన రూ.5 వేల కోట్లు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియలో ఉందని తెలిపారు. నిధుల కొరత కారణంగా పూర్తికి చేరువలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులపై సచివాలయంలో శనివారం నిర్వహించిన సమగ్ర సమీక్షలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

**భూసేకరణకు నిధులు అడగండి..**
**ఆలస్యం చేయొద్దు**

ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆరఅండఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను సాధారణ పరిపాలనాంశాలుగా చూడకుండా అత్యంత ప్రాధాన్యతాంశాలుగా తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత నిధి అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలని, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దని సూచించారు. ఇంజినీరింగ్ పనులు కొనసాగుతుండగానే సాధ్యమైన ప్రాంతాల్లో భూసేకరణ, భూ యజమానులకు పరిహారం చెల్లింపు, నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియను సమాంతరంగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఇప్పటికే వేల కోట్ల ల ప్రజాధనం వెచ్చించిన ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేసి వాటి ఫలాలను రైతులకు అందించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని ఉత్తమ్ తెలిపారు.

**మిడ్ మానేరు ఎడమ కాల్వకు మళ్లీ కదలిక**

సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్ మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. పనులకు అడ్డంకిగా మారిన భూ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సవరించిన అంచనాలు సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధన.. ఇవన్నీ ఒకదాని తర్వాత మరొకటి కాక సమాంతరంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ప్రక్రియల పేరుతో మరోసారి పనులు నిలిచిపోకుండా నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు.

**పత్తిపాకతో 2.40 లక్షల ఎకరాల**
**ఆయకట్టుకు భరోసా**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఉత్తమ్ ఆదేశించారు. ఈ పథకం ద్వారా కొత్తగా పదివేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు కాకతీయ ప్రధాన కాల్వలో డి83 నుంచి డి94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ధర్మపురి, చొప్పదండి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. పత్తిపాక వద్ద 3 టీఎంసీలు లేదా 5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించే రెండు ప్రత్యామ్నాయాలను అధికారులు పరిశీలిస్తున్నారు. లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయని, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ నెలాఖరులోగా డీపీఆర్ సమర్పిస్తామని తెలిపారు.

**రోళ్లవాగు 96 శాతం పూర్తి**

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టుపైనా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.949 టీఎంసీలకు పెంచి, స్థానిక పరీవాహక ప్రాంతం నుంచి లభించే నీటిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా చివరి ఆయకట్టులోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించడం ప్రాజెక్టు లక్ష్యం. మూడు బండ్లు, సర్‌ప్లస్ వీర్, హెడ్ స్లూయిస్‌లు సహా ప్రధాన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయి. అయితే బండ్2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులు అటవీ అనుమతుల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రత్యామ్నాయ అటవీకరణకు అవసరమైన భూమిని ఇప్పటికే గుర్తించడంతోపాటు వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించిన మిటిగేషన్ ప్లాన్‌కు ఆమోదం లభించినట్లు అధికారులు వివరించారు. మిగిలిన అనుమతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**ప్రతీ సమస్యకు 'యాక్షన్ పాయింట్'**

ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఆరఅండఆర్, అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక జాబితా సిద్ధం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. ఏ ప్రాజెక్టులో ఏ సమస్య ఉంది.. దాని పరిష్కారానికి ఎంత నిధి అవసరం.. ప్రస్తుతం ఏ దశలో ఉంది.. ఎప్పటిలోగా పరిష్కరిస్తారు అనే అంశాలన్నింటినీ స్పష్టంగా నమోదు చేయాలని చెప్పారు. సమీక్షలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతీ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని, తదుపరి సమావేశం నాటికి వాటిపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. 'భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ లేదా అటవీ అనుమతుల కారణంగా ఏ సాగునీటి ప్రాజెక్టు నిలిచిపోయినా వెంటనే ప్రతిపాదనలు పంపండి. నిధులకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది.. ప్రాజెక్టులను పూర్తి చేసి నిర్దేశిత ఆయకట్టుకు మరింత ఆలస్యం లేకుండా నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం' అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో నాలుగు జిల్లాల కలెక్టర్లతో పాటు ఇంజినీర్‌ఇన్‌చీఫ్ (జనరల్) ఓ.వి.రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు ఆటంకాలు**
**లేకుండా చూడాలి : మంత్రి దుద్దిళ్ల**

నీటి పారుదల ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణానికి భూ సేకరణ అడ్డంకిగా మారకుండా చూడాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులను ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. భూసేకరణ ఆలస్యం అవడం, అటవీ భూముల బదలాయింపు వివాదాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. నూతన రోడ్ల నిర్మాణం, దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇంజనీర్ల కొరత ఉందన్న ఫిర్యాదులు వస్తున్నాయని, డిప్యుటేషన్‌పై వాటిని సాధ్యమైనంత త్వరలో భర్తీ చేయాలని ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలమయమైన నివాస ప్రాంతాల ప్రజలకు మరొకచోట ఇళ్ల స్థలాలను కేటాయించాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాకాలంలో పారిశుధ్య కార్యక్రమాలు కుంటుపడితే అంటు వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరించారు. మున్సిపాలిటీలు, ఎన్టీపీసీ, జెన్కో, సింగరేణి సంస్థలు సమన్వయంతో పనిచేసి శానిటేషన్ పనులను చేపట్టాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు.

# నిరుద్యోగులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

- **బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు డిమాండ్**

హైదరాబాద్, ఆగస్టు 8, సిరి న్యూస్ :

ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకుని ఉద్యోగాలిస్తామని హామీలు గుప్పించిన మీరు ఇప్పుడు ఆ నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకొస్తే వారిపై ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని అసెంబ్లీలో బీఆర్ ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఓ ప్రకటనలో నిలదీశారు. హైడ్రాలో 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాదిమంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలి వచ్చారని, ఇది నిరుద్యోగుల తప్పా.. లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని ఆయన ప్రశ్నించారు. ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో క్రిమినల్ వేస్ట్ అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోందన్నారు. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం బాధాకరమన్నారు. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు అని అడిగారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి 32 నెలలు దాటింది.. ఆ హామీ ఏమైంది అని అన్నారు రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాదిమంది నిరుద్యోగులు ఇలా క్యూలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అన్నారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్.. జాబ్ క్యాలెండర్ బోగస్.. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు బోగస్ అని హరీష్‌రావు ఎద్దేవా చేశారు. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోందని, నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంతో పీజీ, పీహెచ్‌డీలు చేసిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగాలివ్వడం లేదు.. భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి విద్యార్థులపైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు అని విమర్శించారు. రేవంత్ రెడ్డీ.. హామీలను అమలు చేయాలని నిరుద్యోగులు అడుగుతున్నారు.. ఉద్యోగం అడగడం, ప్రశ్నించడం, ప్రభుత్వాన్ని నిలదీయడం నేరం కాదంటూ ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం కనీసం ఉద్యోగం కోసం వచ్చిన నిరుద్యోగులను గౌరవించడం నేర్చుకోవాలి అని హితవు పలికారు. నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థి, నిరుద్యోగ లోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

# హైడ్రా ఉద్యోగాలకు పోటెత్తిన యువత

- **150 డ్రైవర్ పోస్టులకు వేలాదిమంది పోటీ**
- **తెల్లవారుజామున 4 గంటల నుంచే అభ్యర్థుల బారులు**
- **సరూర్ నగర్ స్టేడియంలో కిక్కిరిసిన నిరుద్యోగులు**
- **తోపులాటతో రంగంలోకి దిగిన పోలీసులు**
- **టోకెన్లు ఇచ్చి అభ్యర్థులను వెనక్కి పంపిన అధికారులు**

హైదరాబాద్,ఆగస్టు 8, సిరి న్యూస్:

నగరంలోని సరూర్ నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యో గులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. డ్రైవర్ పోస్టుల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాదిమంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే సరూర్ నగర్ స్టేడియానికి భారీగా చేరుకున్నారు. ఊహించని రీతిలో వేలాదిమంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత. తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు



చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వా హకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యో గులు వాపోతున్నారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపినట్లు తెలుస్తోంది. టోకెన్ లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్ లో పాల్గొనాలని నిర్వాహకులు చెబుతున్నారు.

# సల్కం చెరువు కేసులో హైడ్రాకు కోర్టు సెగ

హైదరాబాద్, ఆగస్టు 8, సిరి న్యూస్

హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపే లక్ష్యంగా పనిచేస్తున్న హైడ్రాకు సల్కం చెరువు వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్ పరిధిలో ఆక్రమణలపై గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం జరిగిందన్న అభ్యంతరాలపై న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో పాటు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, నీటిపారుదల, రెవెన్యూ, విద్యాశాఖలకు చెందిన ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది.

**విద్యాసంస్థల నిర్మాణాలపై ఫిర్యాదు**

సల్కం చెరువు పరిధిలోని ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్‌ను ఆక్రమించి ఓవైసీకి చెందిన విద్యాసంస్థల భవనాలు నిర్మించారన్న ఆరోపణలతో పిటిషన్ దాఖలైంది. ఈ నిర్మాణాల కారణంగా వర్షాకాలంలో పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాటిలైట్ మ్యాప్‌లు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఆక్రమణలను గుర్తించవచ్చని, అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వాదించారు.

**ఆదేశాల అమలులో జాప్యంపై ఆగ్రహం**

సల్కం చెరువు పరిధిలోని ఆక్రమణలపై గతంలోనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని హైకోర్టు ఆదేశించినట్లు పిటిషనర్ పేర్కొన్నారు. అయితే ఆదేశాలు వెలువడి నెలలు గడిచినా క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించకపోవడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం లేదా అనవసర జాప్యం జరిగితే అది కోర్టు ధిక్కరణ పరిధిలోకి వచ్చే అంశమని స్పష్టం చేసింది.

**అధికారులకు కౌంటర్ దాఖలుకు ఆదేశం**

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు తమ వివరణను కౌంటర్ అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. హైడ్రా కమిషనర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. అధికారుల వివరణను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై న్యాయస్థానం నిర్ణయం తీసుకోనుంది.

**11న తదుపరి విచారణ**

సల్కం చెరువు కేసు తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. అధికారుల సమాధానాలు, ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను న్యాయస్థానం పరిశీలించనుంది. వివరణలు సంతృప్తికరంగా లేకపోతే కోర్టు ధిక్కరణ చట్టం కింద తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉండటంతో ఈ విచారణపై ఆసక్తి నెలకొంది.

**హైడ్రా తీరుపై మరోసారి చర్చ**

చెరువుల ఆక్రమణల తొలగింపులో హైడ్రా కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ, ప్రభావవంతమైన వ్యక్తులు లేదా సంస్థలకు సంబంధించిన నిర్మాణాల విషయంలో అదే స్థాయి చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. సామాన్యుల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటూ, పలుకుబడి ఉన్న సంస్థల విషయంలో వెనుకడుగు వేస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. సల్కం చెరువు వ్యవహారంలో హైకోర్టు జోక్యంతో ఈ విమర్శలు మరోసారి తెరపైకి వచ్చాయి. చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందనే నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు హైడ్రాతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలపై ఉంది.

## మాయమైన ఐఫోన్.. కనిపించని సూసైడ్ నోట్!

- **ట్రైనీ ఐపీఎస్ అధికారిణి లైంగిక వేధింపుల కేసులో కీలక పరిణామం**
- **కస్టడీలోనూ ఫోన్ ఆచూకీపై స్పష్టత ఇవ్వని ఉదయ్‌కృష్ణారెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 8, సిరి న్యూస్

సహచర మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన ఉదయ్‌కృష్ణారెడ్డి వ్యవహారంలో కీలక ఆధారాలు మాయమవ్వడం కలకలం రేపుతోంది. కేసు దర్యాప్తులో కీలకంగా భావిస్తున్న ఆయన ఐఫోన్ ప్రస్తుతం పోలీసులకు అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆ ఫోన్‌లో సూసైడ్ నోట్‌తో పాటు కేసుకు సంబంధించిన ఇతర వివరాలు ఉండే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

**సూసైడ్ నోట్‌పై సజ్జనార్ ప్రశ్నలు**

కస్టడీ విచారణ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ స్వయంగా సూసైడ్ నోట్ విషయమై ఉదయ్‌కృష్ణారెడ్డిని ప్రశ్నించినట్లు సమాచారం. మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో లేఖ రాశానని, అయితే ప్రస్తుతం ఆ లేఖ ఎక్కడ ఉందో తనకు తెలియదని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది.

**ఫోన్ ఎక్కడ?**

సూసైడ్ నోట్ ఉన్నట్లు చెప్పబడుతున్న ఐఫోన్ ప్రస్తుతం కనిపించకపోవడంపై పోలీసులు దృష్టి సారించారు. కేసు విచారణలో డిజిటల్ ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో ఫోన్ ఆచూకీపై స్పష్టత రావాల్సి ఉంది. ఫోన్‌ను స్వాధీనం చేసుకోలేకపోవడం దర్యాప్తు అధికారులకు సవాలుగా మారింది.

**మరో సెక్షన్ నమోదుకు నిర్ణయం**

విచారణలో పోలీసులను, దర్యాప్తు అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఉదయ్‌కృష్ణారెడ్డిపై మరో అదనపు సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కీలక ఆధారాలను అందించకుండా దర్యాప్తునకు సహకరించకపోవడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

**కోర్టులో హాజరు**

కస్టడీ గడువు ముగియడంతో ఉదయ్‌కృష్ణారెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించిన పోలీసులు అనంతరం ఆయనను న్యాయస్థానంలో హాజరుపరిచారు. మరోవైపు మాయమైన ఐఫోన్, సూసైడ్ నోట్ ఆచూకీతో పాటు కేసుకు సంబంధించిన డిజిటల్ ఆధారాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## 'రెంట్ బాయ్‌ఫ్రెండ్' ప్రకటనలతో సైబర్ మోసాలు

హైదరాబాద్, ఆగస్టు 8, సిరి న్యూస్

'రెంట్ బాయ్‌ఫ్రెండ్' పేరుతో సామాజిక మాధ్యమాల్లో, ఇతర ఆన్‌లైన్ వేదికల్లో చక్కర్లు కొడుతున్న ప్రకటనల పట్ల యువతులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ హెచ్చరించారు. మహిళలు, యువతులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ మోసానికి సంబంధించిన వివరాలను తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు.

**ఆకర్షణీయమైన ప్యాకేజీలతో వల**

గంటపాటు కాఫీ సమావేశానికి రూ.499, సినిమా డేట్‌కు రూ.1,249, షాపింగ్‌కు రూ.1,499,వివాహాలు,ఇతర శుభకార్యాలకు తోడుగా వచ్చేందుకు రూ.1,999, రోజంతా అందుబాటులో ఉండేందుకు రూ.4,499 అంటూ ఆకర్షణీయమైన ప్యాకేజీలతో ప్రకటనలు ఇస్తున్నారని సజ్జనార్ తెలిపారు. ఇంటర్నెట్ నుంచి సేకరించిన లేదా కృత్రిమ మేధస్సుతో రూపొందించిన యువకుల ఫొటోలను ఉపయోగించి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

**ముందస్తు చెల్లింపుల పేరుతో మోసం**

ప్రకటనలను చూసి ఎవరైనా సంప్రదిస్తే తొలుత స్నేహపూర్వకంగా మాట్లాడి, ఆ తర్వాత అడ్వాన్స్ లేదా భద్రతా డిపాజిట్ పేరుతో డబ్బులు అడుగుతారని కమిషనర్ వివరించారు. డిజిటల్ వ్యాలెట్లు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా నగదు బదిలీ చేయించిన అనంతరం బాధితులను సంప్రదించకుండా తప్పించుకుంటారని తెలిపారు.

**నేరుగా కలిస్తే మరిన్ని ప్రమాదాలు**

ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులను నేరుగా కలిసినప్పుడు బ్లాక్‌మెయిల్, బెదిరింపులు, ఇతర భద్రతాపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని సజ్జనార్ హెచ్చరించారు. ఇలాంటి ప్రకటనలను నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుగానే డబ్బులు చెల్లించవద్దని సూచించారు.

**అనుమానాస్పద పోస్టులపై ఫిర్యాదు చేయాలి**

తల్లిదండ్రులు తమ పిల్లల సామాజిక మాధ్యమాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సజ్జనార్ సూచించారు. ఎవరైనా ఈ తరహా మోసానికి గురైనా, అనుమానాస్పద ప్రకటనలు కనిపించినా వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ ప్రకటనలపై సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే విచారణ చేపట్టిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

శ్రీశైలం, ఆగస్టు 8 , సిరి న్యూస్:

ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజె క్టు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి శ్రీశైలానికి 2,32,308 క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 876. 20 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 169.46 టీఎంసీలకు చేరింది. ఈ క్రమం లో అధికారులు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుదుత్పత్తి చేసి 66,460 క్యూసెక్కుల నీటిని సాగర్కు విడుదల చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,133 క్యూసెక్కుల నీటి ని విడుదల చేయగా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్కు 8 వేల క్యూసెక్కులు, హంద్రీనీవాకు 875 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాగా, కృష్ణా నదిలో వరద ప్రవాహం పరవళ్లు తొక్కు తున్నా సాగర్కు విడుదల కావడం లేదు. ఒకవైపు కృష్ణా, భీమా నదులు పొంగిపొర్లుతూ శ్రీశైలం వైపు పరుగులు తీస్తుంటే రాష్ట్ర సర్కార్ పాలమూరు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నీటిని ఎత్తిపోయకుండా దోబూచులాడుతున్నదన్న విమర్శలు ఉన్నాయి. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి నాలుగు మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో మరో నాలుగు మోటర్లతో కూడా నీటిని ఎత్తిపోయొచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రెండు ప్రా జెక్టులకు నీటిని వదలకుండా కృష్ణా జలాలను వృథాగా దిగువకు వదిలిపెడుతున్నదని పాలమూరు నేతలు మండిపడు తున్నారు. ఇదిలా వుంటే తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం ప ట్టిందని టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. శనివారం ఉద యం 42,114 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగింది. ప్రస్తుతం డ్యాంలో 1,623.68 అడుగులకు గాను 72.26టీఎంసీల నీటి నిల్వ ఉంద న్నారు. తాగునీటి అవసరాలు కోసం వివిధ కాల్వలకు 1,514 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

## 'సర్' రెండో విడతపై దృష్టి సారించాలి

హైదరాబాద్, ఆగస్టు 8 , సిరి న్యూస్:

రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) రెండవ విడత ప్రక్రియపై పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షు ఎన్.రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కన్వీనర్ వేముల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఎస్ఐఆర్ ఫేజ్ 2 రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 'సర్' ప్రక్రియ ముగియడానికి కేవలం మరో రెండు రోజులు (ఆగస్టు 10 వరకు) సమయం ఉన్నందున ప్రతీ నియోజకవర్గంలోనూ అర్హులైన ప్రతి ఒక్కరితో ఫాం6 ద్వారా కొత్త ఓటు నమోదు వేగవంతంగా పూర్తి చేయించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ గడువు ముగిసిన తర్వాత కూడా రాబోయే రోజుల్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ల పరిశీలన, నకిలీ ఓట్ల గుర్తింపు, అభ్యంతరాల దాఖలు వంటి కీలకమైన అంశాలు ఉంటాయని రామచందర్ రావు స్పష్టం చేశారు. ఫాం7 (ఓట్ల తొలగింపు), ఫాం8 (సవరణలు) సరైన రీతిలో దాఖలు చేయడం, నోటీసులకు తగిన ఆధారాలతో లీగల్‌గా సమాధానాలు ఇవ్వడం, పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించడంపై బీఎల్‌ఏ1లు, లీగల్ టీమ్స్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## మంజూరైన సీసీ రోడ్డు పనులకు శ్రీకారం..

### కనుకుంటలో పనులను ప్రారంభించిన తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్

**రామచంద్రాపురం, ఆగస్టు 8 (సిరి న్యూస్):**



రామ చంద్రాపురం డివిజన్ పరిధిలోని కనుకుంటలో మంజూరైన సీసీ రోడ్డు పనులను తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ శనివారం ప్రారంభించి పరిశీలించారు. కనుకుంటలో డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తన దృష్టికి తీసుకురావడంతో జలమండలి ఆధ్వర్యంలో డ్రైనేజీ పనులు చేపట్టినట్లు పుష్పనగేష్ తెలిపారు. డ్రైనేజీ పనుల కారణంగా రోడ్లు అధ్వానంగా మారడంతో, తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని పుష్పనగేష్ తెలిపారు. ప్రస్తుతం కార్పొరేటర్‌గా పదవిలో లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంలో ముందుంటానని పేర్కొన్నారు.

## మత్తు పదార్థాలు సరఫరా చేస్తే కఠిన చర్యలు

- **నార్సింగిలో 2 కిలోల ఎండు గంజాయి,150 గంజాయి చాక్లేట్ల పట్టివేత.**
- **రూ లక్ష విలువగల గంజాయి స్వాధీనం చేసుకున్న మెదక్ డి టీ ఎఫ్ బృందం.**

**మెదక్ ఆగష్టు,08(సిరి న్యూస్)**




నిషేధిత మత్తు పదార్థాలు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుందని మెదక్ డిటీఎఫ్ బృందం స్పష్టం చేశారు.డిప్యూటీ కమిషనర్ చంద్రయ్య అదేశాల మేరకు,మెదక్ డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నరసింహారెడ్డి పర్యవేక్షణలో డి.టి.ఎఫ్ మెదక్ బృందం నార్సింగి మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహించగా బీహార్ కు చెందిన శివ కుమార్ సాద అనే వ్యక్తి వద్ద దాదాపు లక్ష రూపయల విలువైన (2.0) కిలోల ఎండు గంజాయి, (150) గంజాయి చాక్లెట్లు ను స్వాధీనం చేసుకున్నామన్నారు. సదరు వ్యక్తి పై ఎన్డీపీస్ ఆక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామన్నారు.జిల్లాలో ఎవరైనా నిషేధిత మత్తు పదార్థాలు, గంజాయి,రవాణా చేసిన విక్రయించడం చేసిన కఠిన చర్యలతో పాటు నాన్ బెలబుల్ కేసులు చేస్తామని తెలిపారు.ఇట్టి దాడులలో డీటీఫ్ ఇన్స్పెక్టర్ గోపాల్,ఎస్ ఐ బాలయ్య, కానిస్టేబుల్ లు వహీద్, జీవన్, పుండరికం, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులే ధ్యేయం

- **నల్లూరి హైట్స్ లో అభివృద్ధి బాటలు**
- **సీసీ రోడ్డు ప్రారంభించి పచ్చదనం కోసం మొక్కలు నాటిన శశిధర్ రెడ్డి దంపతులు**



**అమీన్పూర్ ఆగస్టు 8 సిరి న్యూస్**



అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని బీరంగూడ నల్లూరి హైట్స్ కాలనీలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి సొంత నిధులతో 200 మీటర్ల సిసి రోడ్డును నియోజకవర్గ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో తగ్గేదేలే అంటూ సొంత ఖర్చుతో ముమ్మర పనులు చేయించారు. కాలనీలో ఏ సమస్యలున్న నేను ఉన్నానంటూ కాలనీవాసులకు భరోసానిచ్చారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామని నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాలనీవాసుల ఆనందం నూతన సీసీ రోడ్డు నిర్మాణంతో రవాణా కష్టాలు తీరాయని నల్లూరి హైట్స్ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారని తెలిపారు.

## మృతుల కుటుంబాలకు నాతరి భరోసా..



- **ప్రమాద మృతుడి కుటుంబానికి భరోసా..**
- **సింగరేణి ప్రయోజనాలు త్వరగా అందిస్తాం..**
- **మల్లమ్మ మృతదేహానికి నాతరి స్వామి నివాళి..**
- **బాధిత కుటుంబాలకు అండగా కాంగ్రెస్..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి లింగంపల్లి మహేష్ ఆగస్టు 08 (సిరి న్యూస్)**

బెల్లంపల్లి నియోజకవర్గంలో విషాద ఘటనలతో బాధపడుతున్న కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి తెలిపారు. ఒకే రోజు రెండు వేర్వేరు కుటుంబాలను పరామర్శించిన ఆయన, మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

**ప్రమాదంలో ప్రవీణ్ మృతి.. కుటుంబానికి భరోసా..**

తాండూరు మండలం రేచిన గ్రామపంచాయతీకి చెందిన ఎంఆర్పీఎస్ చురుకైన నాయకుడు, సింగరేణి కాంట్రాక్టు భద్రతా సిబ్బంది గోగార్ల ప్రవీణ్ నిన్న రాత్రి ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న నాతరి స్వామి బెల్లంపల్లి ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్‌కు ఇద్దరు చిన్నపిల్లలు ఉండటంతో, వారి కుటుంబానికి సింగరేణి నుంచి అందాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని నాతరి స్వామి హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని, కష్టకాలంలో వారికి ధైర్యం కల్పిస్తామని తెలిపారు. ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు భద్రతా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మల్లమ్మ మృతికి నాతరి స్వామి నివాళి..**

బెల్లంపల్లి మండలం భూదాకుర్దు గ్రామపంచాయతీ ఇందిరానగర్‌కు చెందిన ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకుడు కుష్నపల్లి నారాయణ తల్లి కుష్నపల్లి మల్లమ్మ అకాల మరణవార్త తెలుసుకున్న నాతరి స్వామి.. ఆమె నివాసానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లమ్మ మృతితో విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బరిగల రఘు, నాయకులు అసంపల్లి నర్సయ్య, కుష్నపల్లి రాజలింగు, లింగంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వెలుగులతో వెలిగిన అంగన్వాడీ..



- **ఎమ్మెల్యే చొరవతో అంగన్వాడీకి విద్యుత్..**
- **వెంటనే స్పందించి సమస్య పరిష్కారం..**
- **గడ్డం వినోద్‌కు గ్రామస్థుల కృతజ్ఞతలు..**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 08 (సిరి న్యూస్)**

విద్యుత్ సౌకర్యం లేక చీకటిలో ఉన్న అంగన్వాడీ కేంద్రానికి ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ వెలుగులు వచ్చాయి. బెల్లంపల్లి నియోజకవర్గం బుచ్చయ్యపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ మీటర్ లేక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గ్రామ సర్పంచ్ జాడి మహేశ్వరి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ సంబంధిత విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్ రామ్ మనోహర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్ సిబ్బంది మీటర్, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగల ద్వారా అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరా అందించారు. అలాగే గోస్కుల ఓదేలు, శిలువేరు కళ ఇంటి ముందున్న చీకటి సమస్యకు కూడా విద్యుత్ సౌకర్యం కల్పించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి పరిష్కరించినందుకు బుచ్చయ్యపల్లి గ్రామ ప్రజల తరఫున ఎమ్మెల్యే గడ్డం వినోద్, విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్ రామ్ మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## బోనాలు, ఫలహారం బండి ఊరేగింపులు ప్రశాంతంగా నిర్వహించాలి

- **కుల దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, గొడవలకు తావివ్వొద్దు**
- **దొమడుగు గ్రామస్తులకు ఎస్సై అనిల్ కుమార్ కౌన్సెలింగ్**

**గుమ్మడిదల, ఆగస్టు 8( సిరి న్యూస్ ):**



గత సంవత్సరం దొమడుగు గ్రామంలో ఫలహారం బండి ఊరేగింపు సందర్భంగా చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో ఈ ఏడాది బోనాలు, ఫలహారం బండి ఊరేగింపులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గుమ్మడిదల పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని దొమడుగు గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్సై ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ కుమార్ మాట్లాడుతూ పండుగలు ప్రజలందరూ కలిసి ఆనందంగా జరుపుకునేలా ఉండాలని, ఎలాంటి వివాదాలకు దారితీయకుండా ప్రతి ఒక్కరూ సమన్వయమును పాటించాలని సూచించారు. గత సంవత్సరం ఫలహారం బండి ఊరేగింపు సమయంలో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదైన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని గ్రామస్తులకు సూచించారు. బోనాలు, ఫలహారం బండి ఊరేగింపుల సందర్భంగా కుల దూషణలకు పాల్పడటం, ఇతరులను కించపరిచేలా మాట్లాడటం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, పరస్పరం గొడవలకు దిగడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడవద్దని స్పష్టం చేశారు. ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించుకుంటూ పండుగలను సోదరభావంతో నిర్వహించుకోవాలని కోరారు. ఊరేగింపుల సమయంలో యువత అత్యుత్సాహానికి పోకుండా బాధ్యతగా వ్యవహరించాలని, ఎలాంటి చిన్న వివాదం తలెత్తినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా కూడా వివాదాలకు దారితీసే వ్యాఖ్యలు, పోస్టులు చేయకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రతి ఒక్కరి సహకారంతో బోనాలు, ఫలహారం బండి ఊరేగింపులను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించుకోవాలని గ్రామస్తులను కోరారు. శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

- **ప్రజా పోరాట యోధుడికి ఘన నివాళులు అర్పించిన మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్త.**

**రామాయంపేట, ఆగస్టు 8 (సిరి న్యూస్)**



ప్రజా పోరాట యోధుడు, పేదల ఆకలి కేకలను తీర్చేందుకు పోరాడిన ధీరుడు, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన అమరవీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ముదిరాజ్ యూత్ కమిటీ, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ముదిరాజ్ సంఘం నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సమీపంలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పండుగ సాయన్న విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజు గుప్తా, బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారం హాజరై పండుగ సాయన్నకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పండుగ సాయన్న పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన ప్రజా యోధుడని కొనియాడారు. అన్యాయానికి, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితో యువత సామాజిక న్యాయం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దేవుని రంజిత్, పుట్టి సందీప్, మాజీ పట్టణ అధ్యక్షుడు దాకి స్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల స్వామి, ముదిరాజ్ సంఘం పెద్దలు, ముదిరాజ్ యూత్ కమిటీ సభ్యులు, బీసీ సంఘాల నాయకులు సుంకోజు దామోదర్ చిలుక ఎల్లయ్య, దేవుని నరసింహులు, చింతల స్వామి, భూమా సిద్దరాములు, జీడిపల్లి సత్యనారాయణ, గోల్ పర్తి రాము, భూమా కిషన్, గుడాల లింగం, కంభంపాటి విప్లవ్ కుమార్ తో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. జై ముదిరాజ్... జై జై ముదిరాజ్ అంటూ నినాదాలు చేస్తూ పండుగ సాయన్నకు ఘన నివాళులు అర్పించారు.

# దుర్గమ్మ పండుగకు గుమ్మడిదలలో వెల్లువెత్తిన భక్తజనం

- అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు
- భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ
- పలారం బండి ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, కౌన్సిలర్లు





**గుమ్మడిదల, ఆగస్టు 8 (సిరి న్యూస్ ):**

పురపాలక సంఘం కేంద్రమైన గుమ్మడిదలలో దుర్గమ్మ పండుగను పురస్కరించుకొని శనివారం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉదయం నుంచే దుర్గమ్మ ఆలయంతో పాటు గ్రామంలోని ప్రధాన వీధుల్లో పండుగ సందడి నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమ్మ ఆలయంలో గ్రామ పురోహితుల నేతృత్వంలో ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా ఓడి బియ్యం సమర్పించి అమ్మవారిని వేడుకున్నారు. గ్రామంలోని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి మొక్కుబడులు సమర్పించారు.

**భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ**

రాత్రి సమయంలో మహిళలు తమ ఇళ్ల వద్ద అందంగా అలంకరించిన బోనాలను తలపై ధరించి, భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళల బోనాల ఊరేగింపుతో గ్రామంలో పండుగ వాతావరణం మరింత ఉత్సాహంగా మారింది.

***ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఓడి బియ్యం**

దుర్గమ్మ పండుగ సందర్భంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఓడి బియ్యం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంఘం సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఓడి బియ్యం సమర్పించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు.

**సందడిగా పలారం బండి ఊరేగింపు**

పండుగలో భాగంగా నిర్వహించిన పలారం బండి ఊరేగింపు ఘనంగా సాగింది. పలారం బండిని సంప్రదాయబద్ధంగా అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగించారు. భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు. ఊరేగింపు సందర్భంగా ప్రధాన వీధుల్లో పోతరాజుల విన్యాసం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి తో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొని దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

# ఇంటర్మీడియెట్ విద్యార్థులకు గీతం అవగాహన





**అధ్యాపకుల పర్యవేక్షణలో గణిత, విజ్ఞాన శాస్త్రాల బోధన**

**పటాన్ చెరు, ఆగస్టు 8, (సిరి న్యూస్):**

హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్, గణిత, గణాంక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం ముత్తంగి లోని మహాత్మా జ్యోతీ బా పూలే బి సి వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ, సంగారెడ్డి లోకి ఎస్ ఓ ఈ బాలికల కళాశాలలోని ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం, గణిత, విజ్ఞాన శాస్త్ర అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్ డ్, ఈఏపీసెట్ పరీక్షలకు సమర్ధవంతమైన సన్నద్ధత వ్యూహాలను విద్యార్థులకు అందించడంతో పాటు, ఇంజనీరింగ్, గణితం, విజ్ఞాన శాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించేలా వారిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. అధ్యాపక బృందం, విద్యార్థి వాలంటీర్లు కలిసి పరీక్షా సంబంధిత భావనలు, సమయాన్ని ఆదా చేసే గణితంలో సులువైన మార్గాలు (షార్ట్ కట్లు), శాస్త్రీయ సమస్య పరిష్కార పద్ధతులు, వృత్తి మార్గదర్శనం పై ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. నేర్చుకున్న భావనలను మరింత పటిష్టం చేయడానికి ఒక ఆసక్తికరమైన క్విజ్ పోటీని నిర్వహించారు. ఇందులో విజేతలకు గీతం లోగో తో కూడిన వాటర్ బాటిళ్లు, పెన్నుల ను బహుమతిగా అందజేశారు. పోటీ పరీక్షల కోసం తమ ఆత్మవిశ్వాసాన్ని, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంచిన ఆచరణాత్మక చిట్కాలను, సులువైన పద్ధతులను విద్యార్థులు ఎంతగానో ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. అధ్యాపక సమన్వయ కర్తలు డాక్టర్ పి.నరసింహస్వామి, డాక్టర్ శివారెడ్డి శేరి, డాక్టర్ పి.జితేంద్ర సేనాపతి, డాక్టర్ ఎస్.చక్రవర్తిల పర్యవేక్షణలో, విద్యార్థులు త్రిషల్ సాయి వల్లేపల్లి, చింతలకుంట నితిన్ కుమార్, సుభాంగి పాండా, అనుష్క ప్రజాపతి, పిర్లమర్ల లక్ష్మీ వజ్ర, తలమంచి మనోజ్ కుమార్ ఈ ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# రెండో శనివారం.. ప్రైవేట్ స్కూళ్ల ఇష్టారాజ్యం.!

- రెండో శనివారం సెలవు బేఖాతర్..
- ప్రైవేట్ స్కూళ్ల ఇష్టారాజ్యం.!..
- విద్యాశాఖ ఆదేశాలకు తూట్లు.!..
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 08 (సిరి న్యూస్)**

విద్యాశాఖ నిబంధనలను బేఖాతరు చేస్తూ రెండో శనివారం సెలవు దినాన్ని పాటించకుండా పలు ప్రైవేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు కొనసాగుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటూ విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రెండో శనివారం సెలవు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ శుక్రవారం పత్రికా




ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా రెండో శనివారం సెలవు ఇవ్వకుండా పాఠశాలలు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండించారు. విద్యాశాఖ అధికారులు ఇచ్చిన ఆదేశాలను సైతం పట్టించుకోకుండా పాఠశాలలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులకు అమలులో ఉన్న సెలవు నిబంధనలను ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారి వెంటనే స్పందించి తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక తరపున డిమాండ్ చేశారు.

# హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలపై ఆరా.!..

- విద్యార్థులతో విద్యార్థి నేతల భోజనం..
- హాస్టల్ వసతులపై ఆరా..
- హక్కుల కోసం పోరాటం..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 08 (సిరి న్యూస్)**

హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత, సంక్షేమ పథకాల అమలుపై విద్యార్థి నాయకులు దృష్టి సారించారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో ఉన్న గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించిన టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, జేవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల



వంశీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వసతి గృహ సౌకర్యాలు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థుల హక్కులు, సంక్షేమం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల వంశీ స్పష్టం చేశారు.

## తిరుమల శ్రీవారి దర్శనంలో ఆదర్శ్ రెడ్డి..

**ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు**

**రామచంద్రపురం, ఆగస్టు 8 (సిరి న్యూస్):**



పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి శుక్రవారం సాయంత్రం తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి నెలకొనాలని శ్రీవారిని ప్రార్థించినట్లు ఆదర్శ్ రెడ్డి తెలిపారు. శ్రీవారి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.

## మెదక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడి మధుసూదన్ రావుకు పితృ వియోగం..

**అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందినట్లు పేర్కొన్న కుటుంబ సభ్యులు.**

- ఆర్టీసీ నాయకులు మేడి హనుమంతరావు మృతి.
- సంతాపం వ్యక్తం చేసిన రాజకీయ నాయకులు,ప్రజాప్రతినిధులు.

**మెదక్ ఆగష్టు,08(సిరి న్యూస్)**



మెదక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడి మధుసూదన్ రావు తండ్రి ఆర్టీసీ యూనియన్ నాయకుడు మేడి హనుమంతరావు శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆయనకు భార్య నలుగురు కుమారులు ఉండగా ఒక కుమారుడు శ్రీనివాస్ రావు గతేడాది మరణించాడు.మేడి రాధా కిషన్ రావు,మేడి మధుసూదన్ రావు,మేడి సతీష్ రావు లు ఉన్నారు. హనుమంతరావు ఆర్టీసీలో డిపో క్లర్క్ గా మరియు ఆర్టీసీ కో ఆపరేటివ్అధ్యక్షులు గా సేవలందించారు. ఆయన మరణం పట్ల పలువురు రాజకీయ నాయకులు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు .మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు,మాజీ ఎమ్మెల్యేలు పద్మ దేవేందర్ రెడ్డి, పట్లోళ్ల శశిధర్ రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు,మెదక్ మున్సిపల్ చైర్మన్ కానుగు రాధికా భూపతి రాజ్,వైస్ చైర్మన్ దొంతి నరేశ్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు మల్లికార్జున్ గౌడ్,బట్టి జగపతి, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్,కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్,మామిండ్ల ఆంజనేయులు,దీపక్ కుమార్, న్యాయవాది జీవన్ రావు, సూరినేని వేణుగోపాల్ రావు, బజ్జూరి బిక్షపతి,ఆర్టీసీ నాయకులు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

## రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాల పంపిణీ

**నర్సాపూర్ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి**





**వెల్దుర్తి, ఆగస్టు 08,( సిరి న్యూస్ ):**

రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి జూలై నెలలో వెల్దుర్తి మండల ప్రజల కోసం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల (ఐ క్యాంపు) కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత కంటి క్యాంపులో నిపుణులైన వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు అవసరమైన లబ్ధిదారులను గుర్తించారు. అనంతరం వారికి ప్రత్యేకంగా కంటి అద్దాలను తయారు చేయించి, శనివారం వెల్దుర్తి మండల కేంద్రంలో ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాజన్న ఫౌండేషన్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అవసరమైన వైద్య సేవలు పొందలేని ప్రజలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హనుమన్న గారి నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మాజీ జెడ్పీటిసి సభ్యుడు ఆంజనేయులు, నరసింహారెడ్డి, శేఖ గౌడ్, తలారి మల్లేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాజన్న ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గుమ్మడిదలలో దుర్గమ్మకు వైభవంగా బోనాలు

## భారీ సంఖ్యలో తరలివచ్చిన మహిళలు, భక్తులు



**గుమ్మడిదల. ఆగస్ట్ 8 (సిరి న్యూస్ ):**

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల్లో చివరి ఘట్టమైన దుర్గమ్మ బోనాలను గుమ్మడిదల పురపాలక సంఘం కేంద్రంలో శనివారం మహిళలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. బోనాల వేడుకలను తిలకించేందుకు మహిళలు, భక్తులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు అందంగా అలంకరించిన బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పు చప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి బోనాలను అమ్మవారికి మొక్కులుగా సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులతో కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. మహిళల బోనాల ఊరేగింపుతో ప్రధాన వీధులు సందడిగా మారగా, భక్తుల జయజయధ్వానాలు, డప్పు చప్పుళ్లతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన దుర్గమ్మ బోనాల వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**నేడే లింగమయ్య బోనం**

బోనాల ఉత్సవాలలో ముఖ్యఘట్టమైన లింగమయ్య బోనాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరావాలని గుమ్మడిదల దేవాలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి తో పాటు కమిటీ సభ్యులు కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

# వరుసగా తొమ్మిదో సారి అధ్యక్షునిగా శ్రీనివాస్

- రెండేళ్లకోసారి ఎన్నిక
- వరుసగా తొమ్మిదో సారి

**నల్లగొండ ఆగస్ట్ 08 ,సిరి న్యూస్**

నిడమానూరు పీఆర్టీయు మండల అధ్యక్షునిగా వరుసగా తొమ్మిదో సారి పామ్పాటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పీఆర్టీయు సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎన్నికైన పామ్పాటి శ్రీనివాస్ వరుసగా ఇది తొమ్మిదో సారి ఎన్నిక కావడం గమనార్హం. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కార్యవర్గాలను ఎన్నుకోవడం ఆనవాయితీ. ఎనిమిది సార్లు అధ్యక్షునిగా ఎన్నికౌతు వస్తున్న పామ్పాటి శ్రీనివాస్ ను మరో సారి తొమ్మిదో దఫా సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో అతను పద్దెనిమిది సంవత్సరాల పాటు అధ్యక్షునిగా ఉండే అవకాశం దక్కింది. ఇప్పటి వరకు ఇలా ఇన్ని సార్లు అధ్యక్షునిగా ఎన్నికైన చరిత్ర మండలంలో, జిల్లాలోనూ లేకపోవడం గమనార్హం. ప్రధాన కార్యదర్శిగా గుండ్ల కోటయ్య, అసోసియేట్ అధ్యక్షునిగా శ్రీధర్ రెడ్డి, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా మమత, ఉపాధ్యక్షులుగా కోటయ్య, సుదర్శన్, మహిళా ఉపాధ్యక్షురాలు గా శ్యామల, లీలాకుమారీ, కార్యదర్శులుగా గణేష్, శివప్రసాద్, మహిళా కార్యదర్శులుగా సింధూజ, జ్యోతిల ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులు శ్రీనివాస్ తెలిపారు.

# మరుగునపడుతున్న పల్లె రుచి ముల్క కాయలకు ప్రత్యేకత

- వర్షా కాలంలో మాత్రమే లభించే కాలానుగుణ కూర
- పూర్వీకుల ఆహార సంప్రదాయంలో ప్రత్యేక స్థానం





**గుమ్మడిదల, ఆగస్టు 8( సిరి న్యూస్ ):**

ఒకప్పుడు పల్లె ప్రజల జీవన విధానంలో భాగంగా ఉన్న ఎన్నో సహజ ఆహార పదార్థాలు ఆధునిక జీవనశైలితో క్రమంగా కనుమరుగవుతున్నాయి. అలాంటి పల్లె ఆహారాల్లో ముల్క కాయలు ఒకటి. పొలాల గట్లు, ఖాళీ ప్రదేశాలు, తేమ ఉన్న ప్రాంతాల్లో సహజంగా పెరిగే ఈ మొక్కకు చిన్న చిన్న గుండ్రని కాయలు కాస్తాయి. పచ్చగా ఉన్నప్పుడు కాయలపై కనిపించే ప్రత్యేకమైన చారలు వీటి ప్రత్యేకతగా చెబుతారు పూర్వకాలంలో గ్రామీణులు కాలానుగుణంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, సహజంగా పెరిగే పలు రకాల మొక్కల కాయలను సేకరించి వంటల్లో ఉపయోగించేవారు. అదే విధంగా ముల్క కాయలను కూడా శుభ్రం చేసి కూరగా వండుకుని తినేవారని గ్రామీణ పెద్దలు చెబుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో, జూన్ నుంచి ఆగస్టు వరకు ఇవి ఎక్కువగా కనిపిస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు. ముల్క కాయలు లభించే సమయంలో వాటిని సేకరించి పప్పు, మసాలాలు తదితర పదార్థాలతో కలిపి కూరగా వండుకునే సంప్రదాయం ఉండేదని పెద్దలు గుర్తుచేస్తున్నారు. అప్పట్లో ప్రకృతిలో సహజంగా లభించే కాలానుగుణ ఆహార పదార్థాలకు పల్లె వంటల్లో ప్రత్యేక స్థానం ఉండేది. ముల్క కాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయనే నమ్మకం గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా ఉంది. అయితే వీటికి నిర్దిష్ట ఔషధ గుణాలు ఉన్నాయని చెప్పేందుకు తగిన శాస్త్రీయ ఆధారాలు లేనందున, వీటిని ఔషధంగా కాకుండా కాలానుగుణ సహజ ఆహారంగా చూడటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే ప్రాంతాలను బట్టి మొక్కలకు పేర్లు మారే అవకాశం ఉన్నందున, మొక్కను సరిగ్గా గుర్తించిన తర్వాతే ఆహారంగా తీసుకోవడం అవసరం. ప్రస్తుతం మార్కెట్ లో ఏడాది పొడవునా కూరగాయలు అందుబాటులోకి రావడం, ఆధునిక జీవనశైలి కారణంగా ముల్క కాయల వంటి స్థానిక కాలానుగుణ ఆహారాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. పూర్వీకుల ఆహార సంప్రదాయాలను గుర్తుచేసే ఇలాంటి పల్లె రుచులను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని గ్రామీణులు పేర్కొంటున్నారు.

# గిరిజన గ్రామాలకు రోడ్డు మోక్షమెన్నడు.?

## వర్షం వస్తే దారులు బంద్!..

- ఎడ్లబండే అత్యవసర రవాణా!..
- బడి లేదు.. బాట లేదు.?..
- హామీలే తప్ప.. రోడ్డు లేదు!..



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 08 (సిరి న్యూస్)**

రోడ్డు లేని గిరిజన గ్రామాల ప్రజల బతుకులు ఏళ్లుగా కష్టాల మధ్య సాగుతున్నాయి. వర్షం పడితే గ్రామానికి వెళ్లే దారులు పూర్తిగా మూసుకుపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం బయటకు వెళ్లాలన్నా, నిత్యావసరాల కోసం ప్రధాన రహదారికి చేరాలన్నా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చదివించాలంటే బడి లేదు.. బడికి పంపాలంటే సరైన దారి లేదు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చే నాయకులు ఆ తర్వాత గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని, అధికారులు కూడా సమస్యను పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం పాటి, భోగంపల్లి గ్రామాల దుస్థితి ఇది. రెండు గ్రామాల్లో కలిపి సుమారు 50 కుటుంబాలకు చెందిన 150 మందికిపైగా కోలావర్ గిరిజనులు నివసిస్తున్నారు. ప్రధాన రహదారి నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేదు. వర్షాలు కురిస్తే ఉన్న దారులు బురదమయమై రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు.

**అత్యవసరమైతే ఎడ్లబండే దిక్కు..**

గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైనా, గర్భిణులకు అత్యవసర పరిస్థితి ఎదురైనా ప్రధాన రహదారికి చేరుకోవడం పెద్ద సవాలుగా మారుతోంది. వర్షాకాలంలో కనీసం ఎడ్లబండి కూడా గ్రామానికి చేరుకోలేని పరిస్థితి నెలకొంటోందని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో సమయానికి వైద్యం అందకపోతే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఓట్లప్పుడే హామీలు.. ఆ తర్వాత పట్టించుకునేవారే లేరు..**

ఎన్నికలు వచ్చినప్పుడు నాయకులు గ్రామాలకు వచ్చి రోడ్డు వేస్తామని హామీలు ఇస్తున్నారని, ఎన్నికలు ముగిసిన తర్వాత మళ్లీ గ్రామాల వైపు చూడటం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనుల జీవన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పాటి, భోగంపల్లి గ్రామాలకు తక్షణమే రహదారి నిర్మించి రాకపోకలకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమ గ్రామాల దుస్థితికి మోక్షం కల్పించాలని కోరుతున్నారు.






# బోనాల పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ప్రజలంతా ఐక్యతతో, ప్రశాంత వాతావరణంలో పండుగలను నిర్వహించుకోవాలి

**గుమ్మడిదల, ఆగస్టు 8 (సిరి న్యూస్ ):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో శనివారం నిర్వహించిన దుర్గమ్మ తల్లి బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో బోనాల పండుగకు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలంతా భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ వాటిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ప్రజలంతా ఐక్యతతో, భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో పండుగలను నిర్వహించుకోవాలని సూచించారు. అమ్మవారి ఆశీస్సులతో గుమ్మడిదల ప్రాంత ప్రజలందరికీ మంచి జరగాలని, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వార్డుల కౌన్సిలర్లు పద్మా వెంకట్రాంరెడ్డి, కత్తుల రమేష్, సంజీవరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.



# మరమ్మతుల పేరుతో రోడ్డును తొలగించి గాలికొదిలేశారు!

- ఫుట్ పాత్ పక్కన ప్రమాదకరంగా మారిన గుంత
- ప్రయాణికులు, వ్యాపారులకు తప్పని ఇబ్బందులు
- ఫుట్ పాత్ ను పునరుద్ధరించాలని డిమాండ్




**గుమ్మడిదల, ఆగస్టు 8 (సిరి న్యూస్ ):**

మరమ్మతుల పేరుతో రోడ్డును తొలగించి, పనులు పూర్తిచేయకుండా వదిలేయడంతో ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురపాలక సంఘం కేంద్రమైన గుమ్మడిదల బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారి–765డీ పక్కన ఉన్న ఫుట్‌పాత్ వద్ద ఈ పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారి పక్కన ఉన్న ఫుట్‌పాత్ సమీపంలో నీటి పైప్‌లైన్ మరమ్మతుల కోసం రోడ్డును తొలగించారు. అయితే మరమ్మతులు పూర్తయిన అనంతరం తిరిగి రోడ్డును, ఫుట్‌పాత్‌ను యథావిధిగా పునరుద్ధరించకపోవడంతో ఆ ప్రాంతం అధ్వానంగా మారింది. తొలగించిన ప్రాంతంలో చెట్లు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.

**పురుగులు, కీటకాలతో ముప్పు**

ఫుట్‌పాత్ పక్కన రోడ్డు తొలగించిన ప్రాంతంలో పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలు పేరుకుపోవడంతో పురుగులు, క్రిమికీటకాలు చేరే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో ఈ ప్రాంతం మరింత ఇబ్బందికరంగా మారుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా దోమల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

**ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు**

బస్టాండ్ సమీపంలోనే ఈ సమస్య ఉండటంతో బస్సుల కోసం నిత్యం పెద్ద సంఖ్యలో ప్రయాణికులు వేచి ఉంటారు. ఫుట్‌పాత్ సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డు పక్కనే నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో రహదారిపై రాకపోకలు సాగించే వాహనాల కారణంగా ప్రమాదాలకు అవకాశం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్ పక్కనే ఉన్న దుకాణాల యజమానులు కూడా ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిచ్చిమొక్కలు, దోమలు, పురుగుల కారణంగా వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోందని వాపోతున్నారు. సాయంత్రం వేళల్లో దోమల బెడద మరింత పెరుగుతోందని చెబుతున్నారు.

**వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్**

నీటి పైప్‌లైన్ మరమ్మతుల కోసం తొలగించిన రోడ్డును వెంటనే పునరుద్ధరించడంతో పాటు ఫుట్‌పాత్‌ను కూడా యథావిధిగా నిర్మించాలని ప్రయాణికులు, స్థానిక వ్యాపారులు కోరుతున్నారు. పిచ్చిమొక్కలు, చెట్ల కొమ్మలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న మరమ్మతులను వెంటనే పూర్తిచేసి ఫుట్‌పాత్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గెస్ట్‌హౌస్

- కాంపౌండ్ వాల్ కూల్చివేత.
- పొలాలకు వెళ్లే దారి మూసేస్తున్నారు.
- వందల సంవత్సరాలుగా
- ఆ దారి గుండా నడుస్తున్నాం.
- జప్తి శివునూర్ రైతుల ఆగ్రహం.



**రామాయంపేట, ఆగస్టు 8 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా నార్సింగి మండలం జప్తి శివునూర్ గ్రామంలో శనివారం నాడు రైతులు కన్నెర్ర చేశారు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జప్తి శివునూరు గ్రామం జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ గెస్ట్‌హౌస్ వద్ద నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్‌ను రైతులు ధ్వంసం చేశారు. తమ పంట పొలాలకు వెళ్లే రహదారిని మూసివేస్తూ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడుతున్నారని రైతులు ఆరోపించారు. వందల సంవత్సరాలుగా తాము వ్యవసాయ భూములను సాగు చేసుకుంటూ, అదే దారి గుండా పొలాలకు రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తయితే తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే ఈ విషయాన్ని సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్మాణ పనులు కొనసాగించారని రైతులు ఆరోపించారు. దీంతో ఆగ్రహించిన రైతులు నిర్మాణ పనులను అడ్డుకుని కాంపౌండ్ వాల్‌ను ధ్వంసం చేశారు.

**జీవనాధారమైన పంట పొలాలకు దారి లేకుండా చేస్తారా..? రైతుల ఆవేదన**

తమ జీవనాధారమైన పంట పొలాలకు వెళ్లే దారిని మూసివేస్తే వ్యవసాయం ఎలా చేయాలని జప్తి శివునూర్ గ్రామ రైతులు ప్రశ్నించారు. వందల సంవత్సరాలుగా తమ పూర్వీకులు ఈ ప్రాంతంలో వ్యవసాయం చేసుకుంటూ ఇదే దారిని వినియోగిస్తున్నారని తెలిపారు. పంట సాగు కోసం ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు పొలాలకు తీసుకెళ్లడంతో పాటు, పండించిన పంటను ఇంటికి తరలించేందుకు కూడా ఈ దారే ఆధారమని పేర్కొన్నారు. ఎలాంటి ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా కాంపౌండ్ వాల్ నిర్మిస్తే తమ వ్యవసాయ భూములకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దారి సమస్యను పలుమార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతోనే నిర్మాణాన్ని అడ్డుకోవాల్సి వచ్చిందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి రైతుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పంట పొలాలకు ఉన్న దారిని యథావిధిగా కొనసాగించాలని, రైతుల జీవనాధారాన్ని దెబ్బతీసే విధంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని కోరారు.



**రామాయంపేట సిఐ సైదా నాయక్ వివరణ.**

ఇదిలా ఉండగా మాజీ మంత్రి షబ్బీర్ అలీ ప్రహరీ గోడ కూల్చివేసిన జప్తి శివునూరు గ్రామస్థులను సాయంత్రం రామాయంపేట ఇన్స్పెక్టర్ సైదా నాయక్ పిలిపించి వాస్తవాలు తెలుసుకుంటున్నారు. అన్ని విషయాలను తెలుసుకున్న తర్వాత సమాచారం ఇస్తామని సీఐ సైదా నాయక్ సిరి న్యూస్ విలేఖరికి తెలిపారు.

# రైతులను ఆరుతడి పంటల సాగుకు ప్రోత్సహించాలి

- నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలి
- ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- అర్హులందరికీ కొత్త పెన్షన్లు అందించాలి
- రాష్ట్ర మంత్రులు, సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, ఆగస్టు 8 (సిరి న్యూస్):**

వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా రైతులు పంట కుంటలను నిర్మించుకునేలా, ఆరుతడి పంటలను సాగు చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వానాకాలం పంటల సాగు, స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు తదితర అంశాలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు ప్రస్తుతం వరద నీరు వస్తున్నప్పటికీ, ఆయా రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఆధారంగా చేసుకుని రైతులు ఏ పంటలు సాగు చేయాలనే దానిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. కాలువల కింద రైతులు వరి సాగు చేస్తే, వరద నీరు తగ్గిన అనంతరం పంటలు చేతికి వచ్చే వరకు సాగునీటి విడుదలలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 8న ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డుల సమావేశాలు నిర్వహించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై అంచనాలు రూపొందించుకుని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమావేశాలు నిర్వహించి ముందుకు సాగాలని తెలిపారు. వచ్చే వేసవి వరకు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన వారందరికీ కొత్తగా పెన్షన్లు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ డాక్టర్ ప్రియాంక వర్గీస్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో పలు మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) ట్యాంకులు నిండాయని తెలిపారు. జిల్లాలో రైతులు ప్రధానంగా పత్తి, సోయాబీన్, కంది పంటలను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు.

# కోరుట్ల నియోజకవర్గ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే సంజయ్

### నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రులకు వినతి

**హైదరాబాద్ బ్యూరో, ఆగష్టు 08,**

రాష్ట్ర సచివాలయంలో శనివారం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని కోరుట్ల నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ**

మెట్‌పల్లి–కోరుట్ల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణానికి ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్ బ్రిడ్జి నిర్మాణానికి, కోరుట్ల మండలం కల్లూర్ బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే ఇబ్రహీంపట్నం మెయిన్ రోడ్ మొగిలిపేట రోడ్డు అభివృద్ధికి



నిధులు మంజూరు చేయాలని మంత్రులను కోరారు. అదేవిధంగా మెట్‌పల్లి ఉర్దూ మీడియం స్కూల్,మెట్‌పల్లి పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే నియోజకవర్గంలో రోడ్లు, మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. కోరుట్ల నియోజకవర్గ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సంజయ్ మంత్రులను కోరారు.

# పోగొట్టుకున్న ఫోన్లు కొంటే కఠిన చర్యలు

- ప్రతి మొబైల్ లావాదేవీలు డిజిటల్ గా నిర్వహించాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే జైలు తప్పదు
- అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి




**సంగారెడ్డి, సిరి న్యూస్:**

దొంగిలించబడిన లేదా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సరైన ధృవీకరణ లేకుండా కొనుగోలు చేయడం, విక్రయించడం, మార్పిడి చేయడం లేదా మరమ్మతులు చేయడం చట్టరీత్యా నేరమని, అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి హెచ్చరించారు. జిల్లాలోని అన్ని మొబైల్ ఫోన్ డీలర్లు, రిటైలర్లు, సెకండ్‌హ్యాండ్ మొబైల్ షాపులు, రిపేర్ సెంటర్లు, వ్యాపారులు ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా తగిన నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి మొబైల్ ఫోన్ లావాదేవీలో కొన్ని నిర్దిష్ట జాగ్రత్తలు కచ్చితంగా పాటించాలి. సెకండ్‌హ్యాండ్ మొబైల్ ఫోన్‌ను కొనుగోలు, విక్రయించడం, మార్పిడి చేయడం లేదా రిపేర్ చేయడానికి ముందు సీఈఐఆర్ పోర్టల్‌లో ఐఎంఈఐ నంబర్‌ను తప్పనిసరిగా తనిఖీ చేయాలి. సీఈఐఆర్ ద్వారా పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను బ్లాక్ చేసే అవకాశం ఉంది. తమ వద్దకు వచ్చే ప్రతి మొబైల్ ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నంబర్‌ను నమోదు చేసి భద్రపరచాలి. మొబైల్ ఫోన్‌ను విక్రయించే వ్యక్తి పేరు, చిరునామా, మొబైల్ నంబర్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ లేదా పాస్‌పోర్ట్ వంటి ఫోటో గుర్తింపు పత్రంతో పాటు లైవ్ ఫోటోను తప్పనిసరిగా సేకరించాలి. అన్ని లావాదేవీలకు సంబంధించిన ఇన్వాయిస్‌లు, యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు, రిజిస్టర్‌ను భౌతికంగా లేదా డిజిటల్ రూపంలో తప్పకుండా నిర్వహించాలి. బ్లాక్ లేదా బ్లాక్‌లిస్ట్ అయిన ఐఎంఈఐ ఉన్న మొబైల్ ఫోన్లు, సరైన యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు లేని ఫోన్లు లేదా చోరీకి గురైనట్లు అనుమానం ఉన్న ఫోన్లతో ఎట్టి పరిస్థితుల్లోనూ లావాదేవీలు జరపరాదు. అనుమానాస్పదంగా ఉన్న లేదా చోరీకి గురైనట్లు భావిస్తున్న మొబైల్ ఫోన్ లభిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ సెల్‌కు సమాచారం అందించాలి.

# తల్లి పాలే శిశువుకు మొదటి టీకా

- పుట్టిన మొదటి గంటలోపు తల్లి పాలు తాగించాలి
- చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుచిత్ర, డాక్టర్ మనోహర్
- సిద్దిపేట ప్రభుత్వాసుపత్రిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 08, అఖండదీపం:**

తల్లి పాలే శిశువుకు మొదటి టీకా అని ప్రభుత్వాసుపత్రి చిన్న పిల్లల విభాగ హెచ్‌ఓడీ డాక్టర్ సుచిత్ర, చిన్నపిల్లల సీనియర్ వైద్యులు డాక్టర్ టీసీ మనోహర్ తెలిపారు. ప్రపంచ తల్లి పాల ప్రాముఖ్యత వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించాలన్నారు. ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలను మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లి పాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం, రోగ నిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు మానసిక వృద్ధికి దోహదపడుతాయని తెలిపారు. తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయన్నారు. ప్రసవానంతర రక్తస్రావం తగ్గడం, గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి రావడం, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం తగ్గడం వంటి ప్రయోజనాలు కలిగిస్తాయన్నారు. తల్లిపాలు పట్టడం వల్ల శిశువును ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓలు డాక్టర్ సదానందం, డాక్టర్ మాధవి, డాక్టర్ శ్రావణి, వైద్యులు మాధవి, రమ్య, రాగిణి, రవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొండపాకలో చోరీ

### చిరు వ్యాపారి దుకాణంలో నగదు, వస్తువుల అపహరణ

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఆగస్టు 08**

సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రంలోని కొండపాక స్టాప్ వద్ద, బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ చిరు వ్యాపార సముదాయంలో చోరీ జరిగింది. టీ, సిగరెట్లు, బిస్కెట్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న వడ్ల శ్రీనివాస్ అనే వ్యక్తికి చెందిన దుకాణంలో గుర్తుతెలియని దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం, రోజూలాగే శనివారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా, షాపు తాళం గడ్డపారతో పగులగొట్టి ఉండడాన్ని గుర్తించాడు. దుకాణంలో పరిశీలించగా ఒక గ్యాస్ సిలిండర్, 20 సిగరెట్ డబ్బాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. అలాగే, గల్లా పెట్టెలో ఉన్న రూపాయలు 4000 నగదు కూడా అపహరణకు గురైందన్నారు. ఈ ఘటనపై బాధితుడు వెంటనే కుకునూరుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దుకాణాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తును వేగవంతం చేసినట్లు తెలిపారు.



# ఒత్తిడిని జయించండిలా..!

వ్యక్తిగత జీవితం, ఉద్యోగ జీవితం సమన్వయం చేసుకొనే క్రమంలో చాలా మంది ఒత్తిడికి గురవుతుంటారు. స్ట్రెస్, డిప్రెషన్ అనేవి అనేక ఇతర వ్యాధులకు కూడా కారణం అవుతున్నాయి. తాత్కాలికమైన ఒత్తిడి వల్ల కొన్ని లాభాలున్నప్పటికీ.. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయని చెప్తున్నారు. అసలు ఈ ఒత్తిడిని ఎలా జయించాలి? మానసిక నిపుణులు ఏం చెబుతున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం.



### ధ్యానంతో రిలాక్స్

రోజుకు కొన్ని నిమిషాలపాటు ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడిని జయించొచ్చు. ప్రశాంతమైన మ్యూజిక్ వినడంతో మనసు ప్రశాంతంగా ఉంటుంది. పచ్చదనం ఉన్న ప్రాంతంలో వాకింగ్ చేయడం ద్వారా ఒత్తిడిని జయించొచ్చు. నిరంతర వ్యాయామం చేయడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చు. వ్యాయామం చేసే సమయంలో ఎండార్ఫిన్ విడుదలవుతుంది. దీన్ని ద్వారా ఒత్తిడి నుంచి బయటపడొచ్చు.


### ముందుగా ఒత్తిడిని గుర్తించండి

ఒత్తిడిని జయించాలంటే ఒత్తిడి ఎందుకు వచ్చిందో తెలుసుకోవడం మొదటి అడుగు. ముందు ఒత్తిడి కలిగించే వ్యక్తులు, పరిస్థితులను అధ్యయనం చేయాలి. అటువంటి పరిస్థితులు ఎదురు కాకుండా చూసుకోవాలి. మీకు ఒత్తిడి కలిగించే వ్యక్తులకు దూరంగా ఉండాలి.

### ఆరోగ్యకరమైన ఆహారం కూడా..

ఒత్తిడిని జయించాలంటే పండ్లు, కూరగాయలు, మాంసాహారాలు, తృణ ధాన్యాలు తీసుకోవాలి. అధిక కాఫీ, మద్యపానాలు, చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు సైతం ఒత్తిడిని పెంచుతాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండటం బెటర్. ఇక ఇష్టమైన వ్యక్తులతో మాట్లాడటం.. పుస్తకాలు చదవడం ద్వారా కూడా ఒత్తిడిని జయించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.









# లెమన్ ఆయిల్‌తో ఒత్తుగా జుట్టు

జుట్టుగా ఒత్తుగా ఉండాలన్నది అందరి కల. కానీ ప్రస్తుత జీవనశైలి, పని ఒత్తిడి తదితర కారణాలతో జుట్టు రాలుతూనే ఉంది తప్ప.. ఒత్తుగా ఉండటం లేదు. చాలా చిన్నవయసులోనే బట్ట తల కూడా వచ్చేస్తోంది. ఇక స్త్రీలకు పొడవైన జుట్టు.. అందమైన కురులు చక్కటి అందాన్ని ఇస్తాయి. కానీ ఇప్పుడు పొడగాటి, ఒత్తైన జుట్టు ఎక్కడా కనిపించడం లేదు. ఇక జుట్టును ఒత్తుగా ఉంచుకోవడానికి రకరకాల ఆయిల్స్, క్రీములు, షాంపూలు మార్చేస్తుంటారు. కానీ ఎన్ని ట్రై చేసినా జుట్టు మాత్రం పెరగడం లేదన్నదని యువత భావన. అయితే ఇప్పుడు బ్యూటిషియన్స్ లెమన్ ఆయిల్ తో జుట్టును ఒత్తుగా పెంచుకోవచ్చని ఓ సరికొత్త సలహా ఇస్తున్నారు. అసలు ఈ లెమన్ అయిల్ ఎలా వాడాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. లెమన్ ఆయిల్ తో మీ తల మీద ఉన్న చుండ్రు, ఇతర వ్యర్థాలను తొలగించుకోవచ్చు. ఇక డ్యాండ్రఫ్, పొడి జుట్టును తగ్గించడంతోనూ ఈ ఆయిల్ సహాయపడుతుంది. లెమన్ ఆయిల్ తలలో రక్త రక్తప్రవాహాన్ని పెంచుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. తద్వారా జుట్టు మూలాలకు అవసరమైన పోషకాలు, ఆక్సిజన్ అందుతుందట. లెమన్ ఆయిల్ లో విటమిన్ సీ, యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. వీటితో జుట్టు శక్తి మరింత ఇనుమడిస్తుంది.

### మసాజ్ ఎలా చేసుకోవాలి?

లెమన్ ఆయిల్‌ను కొద్దిగా నెయ్యిలో కలపుకోవాలి. ఈ మిశ్రమాన్ని తల మీద 5 నుంచి 10 నిమిషాల పాటు మసాజ్ చేయాలి. 30 నిమిషాల అలాగే వదిలేసి రసాయనాలు లేని షాంపూతో తల స్నానం చేయాలి. ఇలా నిత్యం వాడటం వల్ల జుత్తు నిగనిగలాడుతుందని నిపుణులు చెబుతున్నారు. లెమన్ ఆయిల్ ను నేరుగా అప్లై చేయొద్దని.. మిశ్రమంగానే వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.



# వర్షా కాలంలో ఈ కూరగాయలు బెస్ట్



వర్షా కాలంలో కొన్ని కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. సహజంగా వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు తరుముకొస్తుంటాయి. చిన్నపిల్లలు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. అయితే వర్షా కాలంలో కొన్ని రకాల కూరగాయాలు తీసుకోవడం వల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ కూరగాయలు పుష్కలంగా పోషకాలను అందిస్తుంటాయి. జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. ఈ కూరగాయలు మీరు ఆహారంలో చేర్చుకుంటే వర్షా కాలంలో ఆరోగ్యంగా ఉండడంలో సహాయపడతాయి.



**కాకరకాయ:** రోగనిరోధక శక్తిని పెంచడంలో, కాలేయాన్ని శుభ్రపరచడంలో, రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది.

**ఆనపకాయ:** ఈ కూరగాయలో ఉన్న నీటి శాతం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది మరియు ఇది తేలికగా జీర్ణమవుతుంది.

**పొట్లకాయ:** ఇది మంచి డైటరీ ఫైబర్ అందిస్తుంది, ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది మరియు మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది.

**బచ్చలికూర:** అధిక ఐరన్ కంటెంట్ రక్తహీనతను నివారించడంలో సహాయపడుతుంది. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

**మెంతి ఆకులు:** ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మరియు ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో సహాయపడుతుంది.

**మునగకాయలు:** రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి మరియు శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**క్యారెట్లు:** బీటా కెరోటిన్, విటమిన్ ఏ మరియు యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది, ఇవి దృష్టిని మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని ఉంచడం వంటి ప్రయోజనాలు అందిస్తాయి.

**బీట్రూట్:** అధిక ఐరన్ కంటెంట్‌తో రక్తహీనతను నివారించడంలో, మరియు శక్తి స్థాయిలను నిర్వహించడంలో సహాయపడుతుంది.

**గుమ్మడికాయ:** విటమిన్ ఏ, సీ, ఈ, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది మరియు జీర్ణక్రియకు సహాయపడుతుంది.

**బెండకాయ:** విటమిన్లు ఏ, సీ, ఫోలేట్, మరియు ఫైబర్ ఉన్నంత మాత్రాన ఇది మంచి జీర్ణక్రియను ఉంచుతుంది మరియు మలబద్ధకాన్ని నివారిస్తుంది.

ఈ కూరగాయలు మీ వర్షాకాల ఆహారంలో చేర్చుకుంటే, అవి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు ఈ సీజన్‌లో ప్రత్యేకమైన రోగనిరోధక ప్రయోజనాలను అందిస్తాయి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
ఆదివారం
ఆగస్టు-09-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 209
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 4



# బోనాల జాతరకు సర్వం సిద్ధం!



- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- ప్రత్యేక పూజలు, ఊరేగింపులకు ఏర్పాట్లు
- భక్తులతో కిటకిటలాడనున్న ఆలయాలు

## ఉమ్మడి మెదక్ జిల్లాలో పండుగ సందడి

ఉమ్మడి మెదక్ జిల్లా బోనాల ఉత్సవాలకు ముస్తాబైంది. ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని అమ్మవారి ఆలయాలు ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణకు సిద్ధమయ్యాయి. ఆలయాలను విద్యుత్తు దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించగా.. ప్రధాన ఆలయాల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో నెత్తిన బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, శోభాయాత్రలతో పల్లెలు, పట్టణాల్లో పండుగ సందడి నెలకొననుంది. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు. మరోవైపు ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. తాగునీరు, పారిశుద్ధ్యం, క్యూలైన్లు తదితర సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించారు. సంప్రదాయం, భక్తి, సంస్కృతి కలగలిసిన బోనాల వేడుకలకు ఉమ్మడి మెదక్ జిల్లా వేదిక కానుంది.

మెదక్ ప్రతినిధి, ఆగస్టు 9(సిరి న్యూస్):

3



# ఘనంగా ప్రారంభమైన మహంకాళి దేవస్థానం బ్రహ్మోత్సవాలు





## 10వ తేదీ వరకు జాతర ఉత్సవాలు

- కన్నుల పండుగగా సుహాసినిల సామూహిక కుంకుమార్చనలు
- అమ్మవారి దర్శనం చేసుకున్న దేవాదాయ,ధర్మాదాయ శాఖ మెదక్, నిజామాబాద్ జిల్లాల సహాయ కార్యదర్శి విజయ రామారావు.
- ఆలయ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ సరాపు పాండురంగా చారి, కార్యనిర్వహణాధికారి రవికుమార్

2

రామాయంపేట, ఆగస్టు 8 (సిరి న్యూస్) మెదక్ జిల్లా రామాయంపేట బస్టాండ్ సమీపంలోని శ్రీ మహంకాళి దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7 నుంచి 10, 2026 వరకు నాలుగు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ప్రతి సంవత్సరం మాదిరి గానే ఈ సంవత్సరం కూడా దేవస్థానం సిబ్బంది ఆషాడ మాసములో జరిగే మహంకాళి బోనాల జాతర ఏర్పాట్లను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సరాపు పాండురంగ చారి, కార్య నిర్వహణాధికారి కె. రవికుమార్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు ఆలయ ఆవరణలో అఖండ దీపారాధన, గణపతి పూజ, అభిషేకం, సామూహిక కుంకుమార్చన, మంగళహారతులు, మంత్రపుష్పం, అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.







# ఘనంగా ప్రారంభమైన మహంకాళి దేవస్థానం బ్రహ్మోత్సవాలు

**10వ తేదీ వరకు జాతర ఉత్సవాలు**

- **కన్నుల పండుగగా సుహాసినిల సామూహిక కుంకుమార్చనలు**
- **అమ్మవారి దర్శనం చేసుకున్న దేవాదాయ,ధర్మాదాయ శాఖ మెదక్ ,నిజామాబాద్ జిల్లాల సహాయ కార్యదర్శి విజయ రామారావు.**
- **ఆలయ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ సరాపు పాండురంగా చారి, కార్యనిర్వహణాధికారి రవికుమార్**

రామాయంపేట, ఆగస్టు 8 (సిరి న్యూస్) మెదక్ జిల్లా రామాయంపేట బస్టాండ్ సమీపంలోని శ్రీ మహంకాళి దేవస్థానంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7 నుంచి 10, 2026 వరకు నాలుగు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ప్రతి సంవత్సరం మాదిరి గానే ఈ సంవత్సరం కూడా దేవస్థానం సిబ్బంది ఆషాఢ మాసములో జరిగే మహంకాళి బోనాల జాతర ఏర్పాట్లను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సరాపు పాండురంగ చారి, కార్య నిర్వహణాధికారి కె. రవికుమార్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు ఆలయ ఆవరణలో అఖండ దీపారాధన, గణపతి పూజ, అభిషేకం, సామూహిక కుంకుమార్చన, మంగళహారతులు, మంత్రపుష్పం, అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం నాడు భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అమ్మవారి శాంతి కళ్యాణోత్సవం, ఒడి బియ్యం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. అమ్మవారి శాంతి కళ్యాణోత్సవం కార్యక్రమంలో రామాయంపేట మాజీ ఎంపీపీ సరాపు మోహనా చారి దంపతులు, ఆలయ అకౌంటెంట్ సరాపు శ్రీనివాస్ దంపతులతో పాటు సరాపు వేణు దంపతులు, మరి కొంతమంది పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే ఆగస్టు 9 ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు, మంగళ హారతులు, తీర్థప్రసాద వితరణతో పాటు మధ్యాహ్నం ఎఫ్.టి. గారి ఇంటి నుంచి సజర్ బోనము, ఎఫ్.టీ. ఆధ్వర్యంలో కడప వద్ద పూజలు నిర్వహించనున్నారు. జాతరలో భాగంగా సువా సీనుల సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. మెదక్ ,నిజామాబాద్ జిల్లాల దేవాలయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషన్ వి. విజయ రామారావు అమ్మవారి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పూజారులు, ఈవో రవికుమార్, సిబ్బంది సరాపు శ్రీనివాస్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా ఆగస్టు 10న సాయంత్రం 6:30 గంటలకు బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో బోనాలతో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు, తీర్థప్రసాద వితరణ, మహా మంగళహారతితో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల కోసం రూ.50 విరాళంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు





## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిద్దిపేట, ఆగస్టు 8(సిరి న్యూస్) : సిద్దిపేట కోమటిచెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి ఒంటిపై లేత పసుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ఉన్నాయి. నీటిలో తేలిఉన్న మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.



# బోనాల జాతరకు సర్వం సిద్ధం!



- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- ప్రత్యేక పూజలు, ఊరేగింపులకు ఏర్పాట్లు
- భక్తులతో కిటకిటలాడనున్న ఆలయాలు

**ఉమ్మడి మెదక్ జిల్లాలో పండుగ సందడి**

ఉమ్మడి మెదక్ జిల్లా బోనాల ఉత్సవాలకు ముస్తాబైంది. ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని అమ్మవారి ఆలయాలు ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణకు సిద్ధమయ్యాయి. ఆలయాలను విద్యుత్తు దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించగా.. ప్రధాన ఆలయాల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో నెత్తిన బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, శోభాయాత్రలతో పల్లెలు, పట్టణాల్లో పండుగ సందడి నెలకొననుంది. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకుంటూ భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు. మరోవైపు ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. తాగునీరు, పారిశుద్ధ్యం, క్యూలైన్లు తదితర సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించారు. సంప్రదాయం, భక్తి, సంస్కృతి కలగలిసిన బోనాల వేడుకలకు ఉమ్మడి మెదక్ జిల్లా వేదిక కానుంది.

**మెదక్ ప్రతినిధి, ఆగస్టు 9(సిరి న్యూస్):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగకు ఉమ్మడి మెదక్ జిల్లా ముస్తాబైంది. ఆషాఢ మాసం ముగింపు దశకు చేరుకోవడంతో గ్రామాలు, పట్టణాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. ఇప్పటికే ఆలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించడంతో పాటు ప్రత్యేక పూజలు, బోనాల సమర్పణ, ఊరేగింపులకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం పలు ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు.

### అమ్మవారికి బోనాల సమర్పణ

ఉత్సవాల్లో భాగంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనాలను మోసుకుని అమ్మవారికి సమర్పించనున్నారు. బోనంలో వండిన అన్నం, పాలు, బెల్లం, పసుపు, కుంకుమతో ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీ. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలిరానున్నారు.

### ఊరేగింపు.. పోతరాజుల సందడి

బోనాల సందర్భంగా పలు ప్రాంతాల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. డప్పు చప్పుళ్లు, కళాకారుల ప్రదర్శనలు, పోతరాజుల విన్యాసాలతో ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఆలయాల్లో ప్రత్యేక అలంకరణ

బోనాల నేపథ్యంలో అమ్మవారి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేసి విద్యుత్తు దీపాలు, పూలతో ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, క్యూలైన్లు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన ఆలయాల వద్ద రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

### పోలీసుల పటిష్ఠ బందోబస్తు

బోనాల ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. రద్దీ ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని మోహరించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆలయాల వద్ద సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేస్తున్నారు.

### భక్తిశ్రద్ధలతో మొక్కులు

ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉంది. తమ ఇష్టదైవమైన అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో పండుగ వాతావరణం నెలకొంది.

### పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

ఆలయ కమిటీలు, ఉత్సవ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. బోనాల పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

